పెరట్లో, దడి అవతల మాట వినబడగా "అవునా కాదా?" అని వొక్క క్షణం పరకాయించి, స్థిరపడగా, అనుకోనిది కావడంవల్ల వింతపడి "సుందరమ్మ వదినా యేమి?" టనడిగింది కామేశ్వరి, ఆప్యాయనంగా పైకి చూస్తూ.

"అవును వదినా" అంది సుందరి, బాల్చీ నూతిపళ్లెంలో వుంచేస్తూ, తానున్నూ అలాగే ఆప్యాయనంగా.

ఆమె కూడా అనుకోని దిది.

కానైతే తల్లి యేమీ తక్కువ చెయ్యలే దామెకి.

బండి గుమ్మంలో ఆగాటప్పటికి "మాామ్మో, మాతల్లే, వచ్చావా?" అంటూ పొంగిపోతూవచ్చి పొదువుకుని మెల్లిగా దింపింది.

కింది చీడీమీాద నుంచోబెట్టి, ఎర్రఅక్షింతలూ పచ్చ అక్షింతలూ దిగతుడిచిపోసింది.

కాళ్లమీాద చెంబెడునీళ్లు పోసింది.

కౌగిలింతలోనే యింటోకి తీసుకువెళ్లింది.

"చిక్కి కండ అయిపోయావుగదే చిట్టితల్లీ" అంటూ మమకారం గుమ్మరించింది.

పెరట్లోకి బయలుదేరగా కూడా వచ్చి కాళ్లూ మొగమూ కడుక్కోడానికి నాలుగుబాల్చీల నీళ్లున్నూ తోడియిచ్చింది.

అయినా సుందరి కేదో లోటుగానే కనిపించింది.

కామేశ్వరి పలకరించాటప్పటికి మాత్రం ప్రాణాలు లేచి వచ్చాయి.

ఇటు కామేశ్వరికిన్నీ పెన్నిధి దొరికిన ట్టనిపించింది.

దాంతో "ఎన్నాళ్ల కెన్నాళ్లకీ! రాజమహేంద్రవరం మరిచిపోయా వనుకున్నాను వదినా" అంటూ ముందు తన సంబరం కనబరిచి, తరవాతే ప్రీతిగా అడిగిం దామె "ఎంతసే పయిందీ వచ్చి?" అని.

"వచ్చాను, నూతిదగ్గిర మొగం కడుక్కున్నాను, నువ్వు పిలిచావు, అంతే"

"కులాసాగా వున్నావా?"

"ఆ"

ఇలా అంది సుందరి; కాని "వదినకు తెలియ దింకా" అనిన్నీ అనుకుని, చిరునవ్వు రాగా సిగ్గు పడిపోయిం దామె.

దీనికి సాయం తల్లి సుబ్బమ్మ అందుకుని "ఏమి నటనే మాతల్లీ? సవతిఆడబడుచు క్షేమం కావలిసివచ్చిందా? యీ సింగమ్మకీ? శాబాసునే" అంటూ కళ్లుతిప్పుకుని, "అన్నం సయించడం లేదని చెప్పావు సుమా" అంటూ మూతి బిగాయించుకుంది.

అత్తగా రేదో అంటున్నట్టు గ్రహించేసింది కామేశ్వరి; కాని స్పష్టంగా వినపడక, లాభం లేదని ఆస్మరణే విడిచిపెట్టేసి "అన్నయ్యగారు కులాసాగా వున్నారా వదినా?" అనడి గింది, మళ్లీ పైకి చూస్తూ.

"కులాసాగానే వున్నారమ్మా! నేనెక్కివచ్చిన రెయిల్లోనే ఆయన చెన్నాపట్టం వెళ్లారు, నేనిక్కడ దిగాను"

"పనిమీద వెళ్లినట్టున్నా" రంది కామేశ్వరి; కాని సుందరి కామాట వినపడకుండా "ఆమాట చెప్పడం యెందుకే ఆ నంగనాచితోనూ?" అంటూ రుంజుకుంది సుబ్బమ్మ, కంఠం నొక్కుకుని.

అంతే.

మరి, అవతల అలికిడి కూడా లేన ట్టనిపించింది.

అత్తగారు, చెయ్యిపట్టుకుని సుందరిని లోపలికి తీసుకు వెళ్లి వుంటుం దనుకుంది కామేశ్వరి.

దీనికి సాయం, లోపల పొయ్యి మండిపోతూ వుండడం జ్ఞాపకంవచ్చి, సగంసగం కడిగిన బియ్యం గబగబా కడిగేసి, ఒక్క అంగ వేసింది వంటింటో కామె.

౨

కూచోబున్నట్టు చూస్తూ పీటపరిచి "కసిన్ని పాలచుక్కలు పుచ్చుకుంటావా తల్లీ?" అనడిగింది కూతుర్ని, సుబ్బమ్మ.

"పాలువద్దు. కాఫీ చెయ్యవే" అంటూ గునిసింది సుందరి; కాని, సుబ్బమ్మ, అందు కిష్టపడక "ఇక కాఫీ మంచిది కాదమ్మా నీకు. నువ్వూ నీమొగుడూ కూడా పా—చ్ఛగా దబ్బపళ్లలా వున్నారు, నల్లని కాఫీకషాయం కడుపులోకి వెళ్లడం నీకిక మంచిది కాదు. అంత యిష్టం లేకపోతే మరింత పంచదార కలుపుకుని పాలే పుచ్చుకోమ్మా, బలంకూడా చేస్తుంది" అంది గడ్డం పుణుకుతూ.

అయినా "వద్దమ్మా" అంది సుందరి.

"సామర్లకోట స్టేషనులో కాఫీ పుచ్చుకున్నాం; కాని నోటికి పోయిందే కాదు. వో - ట్టి బెల్లప్పానకం యిచ్చాడు వెచ్చబెట్టి, అయిన రెండణాలూ కాజేసి తలనొప్పిగా కూడా వుంది" అనికూడా అందామె, కుడిచేతి అంగుష్ఠంతోనూ అనామికతోనూ నుదురు నొక్కుకుంటూ.

ఉలిక్కిపడిపోయింది సుబ్బమ్మ.

"వొళ్లు వెచ్చగా లేదుకదా?" అంటూ అమాంతంగా వెళ్లి కడుపు నిమిరింది.

"రెయిల్లో యెక్కడెక్కడివాళ్లూ వచ్చి అరిటికాయలు కావేసినట్టు మడతొక్కు కూర్చుంటున్నారు కాదూ? దూరప్రయాణం కనక బడలిక చేసింది, అంతే" అంటూ అంతలో స్తిమితపడి "అయితే నీయిష్టం తల్లీ, మీ కేం వుద్యోగస్థు లయిపోయేవా ళ్ళయితిరి, పాలుపనికివస్తాయా మరి? కాఫీ చేసే యిస్తాలే అమ్మా, యిలా కూచో" అంటూ ఆమె మొగం నిమిరి, రెక్కపట్టుకు తీసుకువెళ్ళి, పీటమీద కూచోబెట్టి, తాను కుంపటి దగ్గిర చతికిలబడింది, గుప్పెడు కొబ్బరిపీచు అంటించి.

ఇంతలో శేషాచలం వచ్చాడక్కడికి.

"రా నాన్నా! నాన్న కూడా పుచ్చుకుంటాడు తొరగా చెయ్యవే అమ్మా" అంది సుందరి, తండ్రిని చూసి పీట దిగబోతూ.

"నాకు కాఫీ వద్దు, నువ్వు పీటా దిగవద్దు" అంటూ ఆత్రంగా వెళ్ళి కూతురికి దగ్గిరగా కూచున్నాడు శేషాచలం.

"మూడణాలు పోతేపోయాయి; స్టేషనుకి రిక్షామీద రాక నాకోసం నడిచివచ్చావు పాపం, శ్రమకాదూ? ఉల్లాసంగా వుంటుంది. కసింత కాఫీ పుచ్చుకో నాన్నా" అంటూ తండ్రిని వొప్పించి "అయితేనూ? అన్నయ్య వేసుండడం యెందుకు వచ్చింది నాన్నా?" అనడిగింది చివరికి సుందరి.

సుబ్బమ్మ కళ్ళు చిమచిమలాడాయి.

దీనికి సాయం అవ్యవధానంగా "మీఅమ్మ నడుగు" అన్నాడు శేషాచలం, తాను చెప్పడం మానేసి వూరుకోక.

దీనిమీద ముందు మూతి బిడాయించుకుని తలతాటించుకుంది సుబ్బమ్మ వొక్కమాటు.

"అమ్మాయి నన్నడగలేదా అదడిగితే నేను చెప్పనా, మధ్య మీ పురమాయిం పెందుకూ మహా తీర్పు తీర్చేటట్లూ?" అంటూ కస్సుమంది తరవాత.

శేషాచలం మొగం పక్కకి తిప్పుకుని వూరుకున్నాడు.

సుందరి తండ్రికేసి బిక్కూబిక్కూ చూసింది.

అప్పటికీ భర్తకేసి పులుకూ పులుకూ చూస్తూనే వున్న సుబ్బమ్మ, అతనియెడల: యీసడింపుగా ముక్కూ మొగమూ ముడుచుకుని, తరవాత కూతురికేసి తిరిగి "పనికట్టుకుని మళ్ళీ నువ్వడిగే దేమిటి వినవే అమ్మాయీ" అంటూ అందుకుని "మొన్నటి విఘ్నేశ్వరచవుతికి ఖరాగా పాతికేళ్ళు నిండాయి. నాలుగేళ్ళయి ఆవిడకూడా వచ్చి పుట్టింట గుప్పెడు మెతుకుల కాసాక్కరం లేక పండుగుపబ్బాలక్కూడా కదలకుండా కణాయించుక్కూచుంది. బి. ఏ. అనిపించాక గూడా వొక్క

దమ్మిడీ అయినా తెచ్చి నాచేతిలో పెట్టకపోతే యింకెన్నాళ్ళు మేపమంటావే కూచోబెట్టి మరీ?" అనడిగింది తల మొగర వేసుకుంటూ.

ఈమాటతో కడుపు దేవేసినట్టయి, మాట్లాడలేక, కూతురికేసి మాత్రం వొక్కమాటు దీనంగా చూసి మళ్ళీ మొగం పక్కకి తిప్పేసుకున్నాడు శేషాచలం.

అతని వాలకం చూడగా, సుందరికి, వయసు పెరిగినకొద్దీ తల్లి యెంత రాకాసి అవుతోందో స్పష్టంగా తెలిసిపోయింది.

దాంతోపాటు తన భర్త అప్రయోజకత్వం కూడా స్ఫురించగా, ఒక్క చూపులో తన గీనావస్థ గూడా తండ్రికి సూచించి "మరి, దినం యెలా గడుస్తోందే పాపం, అన్నయ్యకీ?" అనడిగింది జాలిగా, తల్లిని.

"గడిస్తే నాకేం, గడవకపోతే నాకేం? గడిస్తేమాత్రం నాకేమయినా యివ్వాలా, యివ్వకపోతే దేహీ అంటూ నేను దేవురిస్తానా? కనిపారేసింది, వేంచేసిం దావిడ. వూళ్ళోవాళ్ల పూచీ నాకేం అందరిదీ?"

ఇలా అడిగి వొక్క క్షణం నిలవతీస్తున్నట్టు చూసి "దినమ్మా కొంతమూరు వెళ్ళి పెద్దరెడ్డి కొడుక్కింగ్లీషు చెబుతున్నాట్ట కాదూ? నెలకి అరబస్తా బియ్యమూ పదిహేను రూపాయల రొక్కమూ యిస్తాట్ట రెడ్డి, తక్కువేం?" అంటూ విసనకర్ర పుచ్చుకుని కుంపటికేసి తిరిగింది సుబ్బమ్మ.

"సరిపోతాయా పాపం?"

"చాల్తే నాకు పొంగా, చాలకపోతే బెంగా?"

"....................."

"కాఫీ మాన్పించేసిందిట లే రాణీగారు. ఆవిడ మాట కడ్డు చెప్ప లేదుగా ?"

ఇలా అడిగి, కూతురికేసి ప్రశ్నార్థకంగా చూసింది సుబ్బమ్మ.

"నీ అల్లుడుగారూ అంతే, నువ్వేమీ బెంగపెట్టుకోనక్కర్లే" దన్నట్టు బదులు చూపు లందించి "పోనీ, నువ్వేమయినా యిస్తున్నావా నాన్నా ?" అని తండ్రి నడిగింది సుందరి.

గుడ్లనీరు కుక్కుకుంటూ శేషాచలం మొగం వంచుకుని వూరుకున్నాడు.

అంతకి ముందే పురపుర చూస్తూ అందుకుని "ఆ, యిస్తారు మీనాన్న! ఊహ ల్లేవనా? కాని యేం వుందనీ యివ్వడానికి మహా? నెలకి ముప్పాతిక రూపాయలేనా చప్పించను వస్తుందీ? తెచ్చిన్నాడే నాచేతిలో పొయ్యకపోతే యీ సంసారం గడపడం నాతరమా!" అనడిగింది, సుబ్బమ్మ ముందు.

"ఒక్కపూట అయినా — కొడుకుని చూసయినా కాఫీ మానుకోరుగదా మీనాన్న ?" అంటూ చురుగ్గా చూసింది, తరవాత.

శేషాచలం నిలువునా నీరయిపోయాడు.

తుళ్ళిపడి సుందరి తండ్రికేసి ఆత్రంగా చూసింది.

భర్త అలా అయినా కూతు రిలా అయినా అంతటితో వూరుకోక సుబ్బమ్మ "ప్రయోజకుడు కనక, చేసింది రోడ్డు

గుమాస్తాపనే అయినా పాతికయకరాల భూమి సంపాదించాడు మా నాన్న. ప్రేమ వుంది కనక, యిక్కడి లుగసాను చూసి నాకో నాలుగు యకరా లిచ్చాడు కొడుకులతో సమంగా వాటాపెట్టి. అవే లేకపోతే కడుపునిండా బువ్వేదీ మాకూ? అన్నాళ్ళు సబురిజిస్ట్రారుపని చేశారు, వొక్క రూపాయయినా సంపాదించగలిగారా మీనాయన, పైగా? గుడివాడలో వున్నప్పుడు కట్టకాసులపేరొకటీ, మువ్వలవడ్డాణం వొకటీ యెంతో బలవంతం చేస్తూ వొకకమ్మఆవిడ చేతిలో పెట్టింది నాకు, అల్లుడు రాసిన విల్లు రిజస్టరీ చేయించమని. గిజా అన్నారుగాని నామాట విన్నారా మీనాన్న? ఒక్క బరుకు బరికేస్తే వేలకు వేలు చేతిలో పడే కేసు లింకా యెన్ని విడిచిపెట్టేశారో మీ నాన్న నువ్వెరుగుదువా? అప్పుడలా మడికట్టుకు్కుచుని వుండకపోతే మోటార్ల మీద తిరుగుతూ వుండమూ మన మిప్పుడు? ఒక కొత్తనగ అనా, కొత్తచీర అనా యేమనుభవిస్తున్నానే నే నిప్పుడూ? ఏడాదికి రెండు పట్టుచీర లేనా కొంటున్నా న్నీకు? చిలక్కి చెప్పినట్టు చెప్పాను మొన్నటిదాకా గోళ్ళు గిల్లుకుంటూ యింటో కూచోక ఆ రిజస్ట్రారు ఆఫీసుదగ్గర కూచోమని, అదయినా విన్నారా పోనీ? ఇస్తారు, ఇవ్వకేం, సెలగో సెలగ" అంటూ చేతులూ కళ్ళూ తేలవేసుకుంది, పెదవి విరుస్తూ.

కొరడా దెబ్బ తిన్న ట్టయి, దిగ్గున లేచివెళ్ళిపోయాడు శేషాచలం.

కుంపటి విసరడం మానేసి "నన్నేం వుద్ధరిస్తారా?"

అంటూ కూడా యీసడించి, అతను కనబడ్డంతసేపూ పులుకూ పులుకూ చూస్తూనే వుంది సుబ్బమ్మ.

"అయ్యో, పాపం కాఫీ పుచ్చుకోకుండా—" అంటూ తల్లడిల్లిపోయింది సుందరి; కాని "ప్రపంచం మునిగిపోదులే యింతట్లో ?" అంటూ రుంజుకుని పాలగిన్నెకోసం వసారా గదిలోకి చక్కాపోయింది సుబ్బమ్మ.

3

"సుందరమ్మవదిన వచ్చింది" అని చెప్పింది కామేశ్వరి, ఇటు తలుపు తెరిచి గోపాలశాస్త్రి అటు హాల్లో అడుగుపెట్టా టప్పటికి, సంబరపడుతూ.

వెంటనే గోడమీదుగా చూస్తూ "చెల్లీ" అని పిలిచా డతను, జోడు విడవకుండానే.

"ఆ, వచ్చావా అన్నయ్యా?"

ఈమాటలో యెంతో ప్రీతి కనబడి హృదయం చల్లబడగా "వచ్చా నమ్మా" అన్నా డతను, గద్గదికతో.

అని "నువ్వెంతసే పయిం దమ్మా వచ్చి?" అనిన్నీ అడిగాడు.

"మెయిల్లో వచ్చా నన్నయ్యా"

"కులాసాగా వున్నావా"

"ఆ"

"బావగారు—"

"చెన్నాపట్టం వెళ్లా రన్నయ్యా! వచ్చాటప్పుడు దిగుతా రిక్కడ"

"నీ భోజనం అయిందా ?"

"అమ్మ అలా వడ్డించింది, నువ్విలా పిలిచావు"

"అయితే, ముందు భోజనం చెయ్యమ్మా! శ్రీకాకుళంలో యెప్పు డనగా భోజనం చేశావో పాపం!"

"నువ్వెంతసేపయిం దన్నయ్యా వచ్చి?

"తలుపు తెరుస్తూనే నువ్వు వచ్చావని చెప్పింది మీ వదిన."

"నీకేమయినా వుద్యోగం –"

"ఇంకా దొరక లేదమ్మా"

"ఊరుకున్నావా మరీ?"

"ప్రయత్నం మానలేదు చెల్లీ! మొన్ననే తెలిసి ఒక దరఖాస్తుపడేశాను, నిరాశచేసుకునే"

"అదెక్క డన్నయ్యా?"

"ఈవూళ్లోనే "మిస్టేకున్స అండు ప్రిస్టేజ్ కంపెనీ" లో యాభై రూపాయల గుమాస్తాగిరీ ఖాళీ వచ్చిందిలే"

ఇది విని కొయ్యయిపోయింది సుందరి.

ఎంతో వుల్లాసంగా వున్న ఆమె మొగాన విషాదఛాయ అలుముకుంది.

ఇదేమీ మెరగని గోపాలశాస్త్రి "బావగారి కేమయినా వుద్యోగం –" అంటూ మాట నాన్చేశాడు.

"భోజనం చెయ్యి" అనిమాత్రం బదులుచెప్పి లోపలికి వెళ్ళిపోయింది సుందరి.

కూతురి వాలకం చూసి, అప్పుడే ప్రాణావాయుతులు పుచ్చు

కునివుండిన శేషాచలం, అన్నం కలుపుకోడం మానేసి "ఏం తల్లీ, అలా అయిపోయావేం?" అనడిగా డాత్రంగా.

"ఎలా అయిపోయిందీ?" అనడుగుతూ తానున్నా పరకాయించి "అదేమే తల్లీ?" అంటూ కంగారు పడిపోయింది సుబ్బమ్మ నేతిగిన్నె కిందవుంచేస్తూ.

"ఏమి చెప్పుకోను నాన్నా? ఎల్నాటికని విడిచిపెట్టలేదు నన్నింకా" అంది సుందరి, నీరసంగా నట్టింట చతికిలబడుతూ.

శేషాచలానికి వొణుకు పట్టుకుంది.

గోపాలం పిలుపుతో సంబరపడుతూ వెళ్ళిన పిల్ల అతని మాటలతోనే యిలా అయిపోడం చూడగా, అతని కేదో మూడుతుం దనిపించిం దతనికి.

"అదేమి టమ్మా?" అని మాత్రం అనగలిగా డతనీ బెంగతో.

"ఇప్పు డేం వచ్చిందే విస్తరి దగ్గిర కూచున్నదానికీ?" అంటూ గభీ మని ముట్టుకుని సుందరిని పొదువుకుంది సుబ్బమ్మ, ఆత్రంగా చూస్తూ.

దీనికి "అన్నయ్య నావిస్తట్లో అన్నాని కాశపడుతున్నాడు" అని మాత్రం చెప్పి తల్లిమీద వాలిపోయింది, సుందరి.

ఒక్క చరుపు చరిచిన ట్టయిం దెవరో, సుబ్బమ్మకి.

"ఏమిటీ? వాడి దుంప తెగ, ఏంచేస్తున్నాడూ?" అంటూ వురిమిందామె. కంఠంమాత్రం నొక్కుకుని.

"మీఅల్లుడుగారు తంటాలుపడుతున్న వుద్యోగానికే

మొగబారుతున్నా డన్నయ్య" అని బదులు చెప్పింది సుందరి, కళ్ళు తేలవేసుకుంటూ.

"విన్నారా?" అంటూ భర్తని గద్దించింది, సుబ్బమ్మ.

శేషాచలం కొయ్యయిపోయాడు.

మాట రాలే దతనికి.

"హెడ్డాఫీసులో పెద్దదొర నాశ్రయిద్దా మని చెన్నాపట్టం వెళ్ళారు మీఅల్లుడుగారు. ఇక్కడ యిది యిలా జరుగుతోంది. అయితే, నాకు లేకుండాపోతుం దని కుళ్ళినా, అన్నయ్య కాకుండాపోతుం దేమో అని బెంగపెట్టుకోనా?" అంటూ గిలగిల్లాడిపోయింది సుందరి.

"అయితే, అల్లుడూ అబ్బాయీ మాత్రమే—" అంటూ యేదో అనబోయాడు శేషాచలం; గాని "వూరుకోండి అన్నారు మాట" అంటూ రుంజుకుంది ముందు సుబ్బమ్మ.

అందుకే గడగడ లాడిపోయాడు శేషాచలం, బెదురు చూపులు చూస్తూ బల్లిలాగ గోడ కంటుకుపోయి.

"ఇక చాలు. తెల్లవారాటప్పటికింట్లోనుంచి లేవగొట్టేస్తానా పాపాత్ముణ్ణి. తల్లి చావు పిల్లాడుగదా అని చూస్తూవుంటే నాకన్నతల్లి కడుపుమీద కొడతాడా వీడు. ఇక వూరుకుంటే — చూసుకో" మంటూ పరవళ్లు తొక్కేసింది, తరవాత, సుబ్బమ్మ, సుందరిని గాలిలో విడిచిపెట్టేసి.

ఆ వృత్తాంతం చూసి "రామా, రామా" అని మాత్రం అని సగం పీటమీదికీ సగం నేలమీదికీ వొరిగిపోయాడు శేషాచలం.

ఇది చూసీ అదిచూసీ తెల్లపోయింది సుందరి.

కాని "చూశావా?" అంటూ వెంటనే వూచలాగ లేచి "సిద్ధాన్నం! నాన్ననోటి కిక ముద్దపోదు. ఈరభస తెలిసిందంటే అన్నయ్యనోటికి పచ్చి మంచినీళ్లయినా పో వక్కడ. ఊరుకో, వూరుకో, లేకపోతే నన్ను చంపుకుని తిన్నట్టే" అంటూ గట్టిగా పట్టుకుని తల్లినోరు నొక్కేసిం దామె.

౪

హోల్డాలొకచేతా, సూటుకేసొకచేతా పట్టుకుని ముందు రిక్షామనిషీ బీడీప్రాణా లెగపీల్చేస్తున్నట్టు పొగలాగుతూ తర, వాత అల్లుడు చలపతిరావూ హాల్లో అడుగుపెట్టాటప్పటికి అక్కడే కూచుని రేషన్‌బియ్యంలో మట్టిబెడ్డలూ, గండ్రయిసకా, వడ్లగింజలూ యేరుతున్న సుబ్బమ్మ, పాద్యంమాటే స్మరించకుండా "ఏం వుద్యోగం దొరికిందా?" అనడుగుతూ లేచినుంచుంది, చేట ఒకచోట పెట్టీ, ఆశగా చూస్తూనూ.

"ఇంకా లేదండీ" అన్నాడు చలపతి, రెయిలింజన్ లాగ యింటికప్పుకి గురిపెట్టి పొగవిడిచిపెడుతూ.

"చేతు లూపుకుంటూ వచ్చావా?" అనడిగింది మళ్ళీ ఆమె, కాలేదన్న దిగు ల్లేనందుకు నిరాసకంగా చూస్తూ

"అలాగే చెయ్యవలసివచ్చింది" అన్నా డతను, వెకిలిగా నవ్వుతూనూ, నిర్లక్ష్యంగానూ.

"ఏమన్నా డేమిటి దొర?"

"ఆలోచిస్తా నన్నాడు"

"సరే, అదీ వొౕకమాౕటే?"

"..........................."

"నీ కక్కనపడ్డాడా, పోనీ?"

"ఆలోచిస్తా నన్నా డన్నాను కాదుటండీ?

"ఆలోచన కాదు, నాకు తెలుసు. మాద్వారపూడి పచ్చిపా డక్కడి కూక్కడా రాసిన ట్టున్నాడు –"

పళ్ళుపటప ట్టాడిస్తూ సుబ్బమ్మ యిలా మాట్టాడుతూ వుండగానే "అదేమి" టనడిగాడు చలపతి, పసుపుకుంకుమ లతో కలకల్లాడుతూ వున్న సింహద్వారం గడపమీాదికి బీడీబూడిద రాలుస్తూ.

మరో సందర్భం అయితే, అలాంటి అభాజనప్పని చేస్తు న్నందు కత ణ్ణయినా దులిపేసివుండునామె; కాని మనసులో మరోమంట మండుతూ వుండినందున అది గమనించక "మా గోపిగాడు నీమీాద పోటీ యేడుస్తున్నాడులే" అంది రుంజు కుంటూ.

అనేసింది కాని యీామాట అవతలివాటాలో వున్న కోడలు కామేశ్వరికి వినపడిపోయిం దేమో అని తెల్లపోయింది కొంచెం; కాని సరిగా ఆ సమయానికే అవతలివంటింటోనుంచి పోగుపుఘాటు దూసుకువచ్చింది.

దాంతో కుదుటపడిం దామె.

ఈలోపున "ఏమిటీ? వివరంగా చెప్పండీ" అన్నాడు చలపతి, బీడీ చేతపట్టుకుని పొగ నములుతూ.

ఆగొడవలో యీామాట వినబడలే దామెకి.

అతనికే సయినా చూడలేదామె.

"నా చిట్టితల్లి వుసురు తగలదూ వీడికీ?" అని రుసరుస లాడుకుంటూ వంటింటోకి చక్కాపోయిందామె, బియ్యపు చేట అందుకుని.

తల్లినాలకం గుర్తించి "అల్లుడుగారు వచ్చారా?" అనడిగింది, సుందరి.

"ఉద్యోగం దొరకలేదుట. నేను చెప్పలేదూ? ఓపిక పట్టమని నానోరు నొక్కేశావు — ఏం కుదిరిందా?"

"పోనీ, అన్నయ్యకి దొరికిందటనా?"

"దొరకాలని వుందా నీకు?"

అక్కడ జరిగింది తెలియకపోడం — ఇక్కడ యీవుప్పెన. వీటికి సాయం, తల్లి అఘాయిత్యం — మాట్లాడకుండా సుందరి హాల్లోకి బయలుదేరింది.

అలా రుంజుకుంటూనే చెంబుతో నీళ్ళు తెచ్చి సుబ్బమ్మ అటూ యిటూ చూడగా, సుందరీ చలపతీ దక్షిణపు తెరపిలో మాట్లాడుకుంటున్నారు.

"ఎవడికో వొకడి కీవుద్యోగం యివ్వడం యిక్కడ వున్న చిన్నదొ కేటు" అన్నాడు చలపతి.

శిరస్సున పిడుగుపడ్డట్టయింది సుందరి కీమాటతో.

"శ్రమ అలా వుండగా, యాభై రూపాయలు — వొక్క నెల గ్రాసం — శుష్కదండుగు" అంటూ దేవుళ్ళాడిందామె.

"పోనిస్తూ. దేవుడు మేలుచేస్తే యాభై రూపాయ లొక్క చిల్లిగవ్వకి సమానం. పోతేపోయింది, బెంగ పెట్టుకోకు.

ఈ దరిద్రం యెప్పుడూ వుండేదే, చాలా దినా లయింది దర్జాగా చెన్నపట్నం చూసివచ్చాను" అన్నాడు చలపతి తల యెగరవేసుకుంటూ.

సుందరి మనస్సు చివుక్కుమంది; కాని జీవనభారం యీ భారం మరిపించగా "ఇక్కడి చిన్నదొరని చూడాలటనా?" అనడిగింది దిగులు కనపడకుండా అణుచుకుంటూ.

"అన్నమాటే"

"ఇతగాడేం పరీక్ష చేస్తాడో?"

"చేస్తే? ఉహు! నాకు లక్ష్యమా, కాలేజీఫస్టుగా వచ్చినవాణ్ణి, లెక్కల్లో!"

"..............."

"పెళ్ళికొడుకు పెళ్ళికూతుర్ని చూసుకోడం యెలాంటిదో, కంపెనీవాళ్ళు దరఖాస్తుదార్లని చూసుకోడం అలాంటిదే, తప్పుతుందా మరీ?

"..............."

"కాక, — కంపెనీవాళ్ళ వాలకం దరఖాస్తుదారు మాత్రం చూసుకోవద్దూ, నచ్చుతుందో నచ్చదో?"

"నచ్చకపోతే?"

గతుక్కుమన్నాడు చలపతి.

కాని, అంతలో దిటవు తెచ్చుకుని "నచ్చుతుందీ, మన సిచ్చి పనిచేస్తాం. నచ్చదూ, మొగం చాటేస్తాం రసకందాయప్పట్లలో"

"ఇంతా చేసి యీ అపశకునం మాటేమి" టనుకుంది సుందరి.

చూడగా, మొగమంతా గర్వం చేసుకుని చూస్తున్నాడు చలపతి.

ధోరణి మార్చ దలిచి "ఇతగాడు మాత్రం ఆలోచిస్తా ననడూ?" అనడిగిం దామె.

"అనక! అంతవ్యాపారం చేస్తున్న వాడు, మొగం మెర గనివాళ్లు వెళ్లి, మీదపడితే చటుక్కున వుద్యోగం యిచ్చే స్తాడా మరీ?" అని మెదు రడిగా డతను.

"....................."

"ఇంతకీ,—ఆ పెద్దదొరకంటే యీచిన్నదొరే బహూ నిదాన మైనవాడుట"

"....................."

"అసలు సంగతి విన్నావా?"

"ఏమిటీ?" అనడిగిం దామె, వులిక్కిపడి చూస్తూ.

"ఆవొక్క గుమాస్తాగిరీకోసమూ రెండువందల పాతిక దరఖాస్తులు వచ్చివున్నాయి టిప్పటికి"

ఇది విని "అమ్మోయ్?" అంటూ ముడుచుకుపోయింది సుందరి.

ఆకాశం అంతా నిండి, తనలాగే నూటయిరవై నలుగురు యువతులు, ఇంత అన్నంకోసం అంగలార్చుతూ కనిపెట్టుకుని వుండిన ట్టనిపించిం దామెకి.

వారి పురుషు లందరూ, మిడిమెండలో చెమటలు వోడు కుంటూ కంపెనీ ఆవరణలో పడిగాపులు పడివుండినట్టున్నా కనపడిం దామెకి.

అంతమందిలోనూ తన భర్త, సముద్రంలో వొక నీటి బొట్టు.

తుపానురేగివున్న నడిసముద్రంలో తన అన్న గోపాల శాస్త్రి పోటీ వొక పెద్ద కెరటం.

ఆమె కాళ్లలుడిగాయి.

కాని "మార్చి వొకటో తేదీ ఉదయం పదకొండు గంట లకి దరఖాస్తుదారు లందరూ వస్తే, చిన్నదొర, తనకి నచ్చిన వాడి కిస్తాడుట ఆవుద్యోగం" అన్నాడు చలపతి, నిర్వికారంగా.

"ఇంకా యెందరు సిద్ధపడతారో మరి?" అంది సుందరి. ముందు పెద్ద నిట్టూర్పు విడిచి.

"మానాారూ? ఉసుళ్ళపుట్టలా తయా రయిపోతున్నా రామె కొత్త బి. ఏలు" అన్నాడు చలపతి, తనని పాత బి. ఏ. లో లెక్క కట్టుకుని.

చాలా నిస్సారంగా అన్నా డత నీమాటకి కాని "పాత బి. ఏ. వి నువ్వు, నీ ప్రయోజకత్వం యిలా వుంది మరి" అని యెవరో డెకారించిన ట్టయిం దతనికి.

సుందరే అందనుకున్నాడు మొదట; కాని విదానించగా, పక్కకి చూస్తోం దామె సాలోచనగా.

ఆమె కా దని నిశ్చయించుకున్నాడు.

"సుందరే అయితే నువ్వనదుగా?" అనుకుని కూడా అతను సమాధానపడ్డాడు.

ప్రాణాలు కుదటపడ్డాయి.

అయితే, సుందరి చాలా ఆదుర్దాపడిపోతోంది, యీ విషయమై.

చివరి కేది యేమయినా తనవల్ల ప్రయత్నలోపం లే దని ఆమె గుర్తించాలి.

"రేపుసాయంత్రం అయిదు కొట్టేదాకా పుచ్చుకుంటూనే వుంటారుట దరఖాస్తులు. పుచ్చుకోడం యేమిటి, డబ్బాలో పడెయ్యడమేట కళ్లు మూసుకుని" అన్నా డతను, సుందరి వాలకం పరిశీలిస్తూ.

"స్స! రామయ్యతండ్రీ" అని మాత్రం అందామె, కళ్లు మూసుకుని యిటున్న మొగం అటు తిప్పుకుంటూ.

"పడేస్తూనే వున్నారుట, గుంపులుగా కలిసికూడా వచ్చి"

ఇలా అని మళ్లీ పరిశీలించా డతను.

"అయితే –" అంటూ మాట నాన్చేశా డతను, సుందరి దృష్టి యిటు తిప్పా లని.

అనుకున్నట్టే చూసింది; కాని "యేమిటి అయితే?" అనడిగిం దామె, నిలవతీస్తున్నట్టు చూస్తూ.

ఆలోచించాడు:

తలలో ఒక మెరుపు మెరవగా కళ్లు జిగాల్మన్నా యతనికి.

"నేను చెన్నపట్నం వెళ్లాను కనక, వెళ్లి పదిరూపాయల కాగితం అక్కడి పెద్దగుమాస్తాగాడి మొగాన కొట్టాను కనక, నాకు తెలిశా యీ... రహస్యాలు. కూపకూర్మంగాళ్ల కేం తెలుస్తాయీ?" అనడిగా డతను, గోపాలశాస్త్రి నుద్దేశించీ, మొగం అంతా గర్వంచేసుకునీని.

"మరి తెలుసుకుంటే కలిగే ప్రయోజనం?" అనడిగింది సుందరి, అవ్యవధానంగా.

అటు చూస్తూనే యాదాలాభంగానే అడిగింది కానైతే.

కాని అడిగి మాత్రం అతని కళ్ళల్లోకి చూసింది, నిదానంగా.

చూపించిన గడుసుదనం అంతా వ్యర్థం అయిపోయింది, దీంతో.

చలపతి గుండెలు దడదడలాడిపోయాయి.

చూపులు చెదిరిపోయాయి.

కంఠం బిగుసుకునేపోయింది.

చూసింది చూసింది "అవునులెండి. ఎంతమంది మొగబడ్డా అంతమందిలోనూ దొరక్కావలసినవాడొక్కడే. ఎవర్తి పెట్టిపుట్టిందో మరి, అంతమందిలోనూ పెనిమిటి ప్రమోజకత్వం అనుభవించడానికి" అంది సాలోచనగా సుందరి.

చలపతి కొయ్యయిపోయాడు.

ధర్మమే.

ఉద్యోగం దొరక్కపోడం కంటే, బి. ఏ. అయినవాడికి, తనభార్య తన దుర్దినాలు గుర్తించకపోడం చాలా బాధాకరం మరి.

అయితే, ఉద్యోగం స్వాయత్తం కాదు.

ఈ క్లిష్టపరిస్థితుల్లోంచి బయటపడగలగడం మాత్రం స్వాయత్తం. కనక, తన నిర్విణ్ణత ఆమెకి తెలియకుండా వుండాలని గభీమని పక్కజేబులో చెయ్యిపెట్టి అగ్గిపెట్టే కరేంబీడీ చర్రున పైకి లాగాడు చురుగ్గా చూస్తూ.

ఈమాటలు కొన్ని వినపడ్డాయి సుబ్బమ్మకి, కొన్ని వినపడలేదు.

వినపడ్డంతవర కయినా సమన్వయం కుదరలేదు; కాని పదిరూపాయలు గుమస్తా మొగాన కొట్టిరావడం మాట మాత్రం స్పష్టంగా తెలిసిం దామెకి.

"ఇంకేం, గడ్డి తినిపించేవచ్చాడు, కనక, ఉద్యోగం తప్ప" దని స్థిరపరుచుకుం దామె చలపతికి.

దాంతో, నిరసనభావం పోయి ఆదరభావం పుట్టుకు వచ్చిం దామెకి.

తన బాధ్యత కూడా గుర్తుకి వచ్చింది.

"గోపిగాడికంటే ముందే వెళ్ళాలి చలపతి. కనక, రేపు తొమ్మిదింటికే భోజనం పెట్టేస్తా నతనికి, అరటికాయ ముక్కలు వేయించి" అని స్థిరపరుచుకుంది.

"కాళ్ళు కడుక్కో, నిమిషంలో కాఫీ చేసేస్తా" నంటూ చెంబూ నీళ్ళూ అక్కడః వుంచేసి యింటోకిన్నీ వెళ్ళిపో పోయింది, వూచలాగ.

ధుమధుమ లాడిన అత్తగా రిలా అనడం 'దాసోహం' అనడంగానే భావించుకుని బాగా పురెక్కాడు చలపతి.

ఎక్కడ లేని చురుకూ వచ్చిం దతనికి.

అది చేతుల్లో కనపడింది మొదట.

గప్పు మంది అగ్గిపుడక, దాంతో; కాని అందుకు మొగం చిట్లించుకుంటూ యిటున్న మనిషి బొంగరం లాగ అటు తిరిగి "నీళ్ళు తోడి వుంచుతాను నూద్దగ్గిరికి రండి, స్నానం చేద్దురుగాని" అంటూ పెరట్లోకి బయలుదేరింది సుందరి, కాళ్ళీడ్చుకుంటూ.

ఇంతలో బీడీ అంటించి, ఎందునా లేని శ్రద్ధతోనూ ఏకాగ్ర

దీక్షతోనూ ఒక్క దమ్మున్నూ లాగి "చూడూ, స్నానానికేం గానీ — ఈ రెయిలుప్రయాణాలతో వుడుకు చేసేసింది. కమ్మగా నిద్రపోయి నాలుగుదినా లయింది, కనక, భోజనం చేసి చెయ్యి కడుక్కునేటప్పటికి పక్క సిద్ధంచేసి వుంచాలి, తెలుసా ?" అన్నాడు చలపతి, అక్షరం అక్షరమూ బీడీపొగతో పొడ్డుపుతూ.

౨౩

"ఏవూ రండీ మీదీ ?"

"అమలాపురం తాలూకా"

"పల్లెటూ రన్నమాట"

"హా ! హా ! హా !"

"ఏం, నవ్వుతున్నారు ?"

"పల్లెటూళ్ళకి వెళ్ళమంటున్నారు కాంగ్రెసు పెద్దలు. పరిస్థితులు పట్నాలకు తరుముతున్నాయి, మరి"

"ఏం చదివారు ?"

"చదవడం యేమిటి, తెగేసి ఆన ర్సయివుంటే ?"

"ఏంచేస్తున్నారు ?"

"ఊరికే కూచోడం యెందు కని — ఎందు కయినా మంచి దని ట్రెయినింగు పూర్తిచేసుకుందా మని — రిజుల్టుసూకల్లో పని చేస్తున్నానింకా"

"ఎన్నాళ్లనుంచీ ?"

"రమారమీ మూడేళ్లనుం చనుకోండి"

"ఏమాత్రం కిడుతోంది ?"

"... ... ... ..."

"మనలో మనమాట సుమండీ"

"టీ, బీడీ"

* * * * * *

"ఏవూ రన్నా మీది?"

"కర్నూలు. మరి మీది?"

"గజపతినగరం. గ్రాడ్యుయేటా?"

"ఎం. ఏ., బి. ఎల్"

"అబ్బా?"

"మరి మీరు?"

"ఎం. ఎస్ సి. మరి అంతటితో ఊరుకున్నా రేం?"

"ట్రెయినింగు సీటుకోసం నాలుగేళ్లుగా తంటాలు పడుతూనే వున్నానండీ"

"బల్ల కట్టరూ?"

"ఈమాత్రం కిడుతుం దన్న పూచీ యేదీ?"

* * * * * *

"విన్నావా?"

"అనుకో"

"నాకీ వుద్యోగం దొరకక్కపోతేనే మంచిది సోదరా"

"అదేమి భ్రాతా!

"చాలా పెద్దగాథ అది"

"పోనీ, తీరా, దొరికేస్తే?"

"పనిలో చేరిన మర్నాడే ఆరుమాసాల సెలవుకి దరఖాస్తు పడేస్తా, డాక్టరు సర్టిఫికెట్టు జతచేసి"

"సిద్ధపడ్డం మెందుకూ మరీ?"

"ఇల్లరికం రావాలని షరతు పెట్టి పిల్ల నిచ్చింది మొదట. 'నాకూతురు లక్షాధికారి గదా, నువ్వుద్యోగం చెయ్యకపోతే నలుగురిలోనూ తలమెత్తుకుని తిరగడం మెలాగా?' అంటూ పీకలమీద కూచుం దిప్పుడు మా అత్తగారు"

"మీఆవిడ మేమంటారు?"

"ఉద్యోగం చేసి మీరు పట్నంలో యింటి అద్దె సంపాదించండి. దర్జాగా పోషిస్తుంది మాఅమ్మ –"

"ఉద్యోగం దొరక దనుకోండి"

"నాకేం దొరక్కపోతే? పెళ్లి కదాక షరతుకాదు, తెలుసా? బాగుం దండోయ్, పుత్రెను పుట్టనిదానికి నాదా పూచీ. అదంతా వాళ్లు చూసుకోవలసిందే."

"సైబాస్!

"వాళ్లు పీక్కుతినేశారు, నేను దరఖాస్తు పడేశాను, దానికీ దీనికీ చెల్లు."

"మంచి లెక్కగాళ్ళండీ మీరు"

"అయ్యా, కిట్టింపు చూసుకోవాలి దేల్లో అయినా?"

"దరఖాస్తు పడెయ్యడంలో –"

"ఖర్చుల కని పాతికరూపాయ లిచ్చి పంపింది మా అత్తగారు."

"మంచి ఔదార్యమే"

"మరి, మన ప్రతిభ?"

"ఇంకేమిటీ విశేషం?"

"లక్షాధికారి మొగుడు ఉద్యోగం కొట్టుకురావడానికి వెడుతున్నాడు. ఆలోచించుకో" అన్నాను. మా ఆవిడ మరో పాతికరూపాయ లిచ్చింది"

"తల్లికి తగ్గ కూతురు –"

"మరి, అల్లుడు తీసిపోయా డనా మీవుద్దేశం?"

"అబ్బే, మీరా తీసిపోడం?"

"గుర్తించారు కదా? వాళ్ళనీ వాళ్ళనీ చూడవలసి వుంటుందని చెప్పి మూడు రోజులకిందట ప్రవేశించా నిక్కడ, ఇంటిదగ్గిర వీలులేకపోడం చూసుకుని. దినానికి మూడు సినీమాలు చూస్తున్నాను దర్జాగా. చివరికి, అరడజను డబ్బాలు పాసింగుషో కొనేస్తాను 'నన్నేం చెయ్య మన్నా' వనడు గుతూ తెల్లవారాటప్పటి కింటికి వెళ్ళి కూచుంటాను"

* * * * * *

"అరే, మీరు విద్వాన్‌గదా శర్మగారూ?"

"హైస్కూల్లో దరఖాస్తు పడేసినప్పు డది"

"మరి, యిప్పుడు?"

"బి. ఎస్ సి"

"ఎప్పుడూ వినలేదే?"

"మీరు వినం దింకోటుంది"

"అదేమిటి?"

"మాధ్యమిక్"

* * * * * *

"మీ రెక్కణ్ణుంచి వచ్చా రండీ?"

"ముందు మీసంగతి చెప్పి తరవాత అడగండి, నా భోగట్టా"

"నేను మచిలీపట్నంనుంచి వచ్చాను. బి. ఏ. అయినాను. బి. ఎల్. చీదేసింది. ట్రెయినింగుకోసం చూస్తున్నాను.

నౌకరీకోసం తంటాలుపడ్డమే ఒక గొప్ప క్రెయినిం గని పిస్తోంది. జీతం యెంత అని లేదు. ఉద్యోగం చెయ్యాలి, ఇదీ నాదీక్ష. ఇందుకోసం వచ్చా న్నేను"

"ఇక వినండి. నేను మొదట శ్రీకాకుళంలో యిల్లు విడిచాను. చెన్నపట్నంనుంచి యిక్కడ వాలాను. మాఅత్తగారి చేతి ప్రసాదం పుచ్చుకుని యిలా వచ్చాను, చివరికి"

"చదువు–"

"నాలుగే ళ్లాయి, బి. ఏ. అయిపోయానుగదా?"

"అయితే, మీరు కొట్టేస్తా రిది తప్పదు.

"ఏమి నేస్తం అలా అనేశారూ?

"మీదీక్ష అసాధారణంగా కనపడుతోంది"

"ఊహూ!"

"చిల్లిగవ్వా రూపాయీ మీకు సమానం అనిన్నీ తోస్తోంది నాకు"

"కనక?"

"ఖర్చుపెట్టేవాడికి డబ్బివ్వడం పూచీ భగవంతుడిది"

"అన్నారూ? అదీ మాట. ముందిది స్వీకరించండి, దయవుంచి"

"బీడీకట్ట కూడా తెచ్చారుమీరు, భారతజాతీయం అదే దయచేస్తురూ"

"అదే అన్నమాటేమిటి, రెండూ పుచ్చుకోండి, లోటేమిటీ?"

"నిజంగా, యూరపియన్లుదగ్గిర వుండవలసినవా రండీ మీరు"

"గుర్తించారుగదా? ఏదీ షేక్ హాండు. అదీ నాధైర్యం. కీడెంచి మేలెంచ మన్నాడు శాస్త్రకారుడు. నాకిది కాదంటారా? బాధపడను. రెండు దినాలుగా హరనాథప్రభువుని ప్రార్థించుకుంటున్నాను, గాఢంగా. ఏమనంటారా?" ప్రభూ, నువ్వో చిన్న నౌకిరీచేసి దేవుల్లాడినవాడివి. కనక, యిది నాకే అనుగ్రహించు. లేదూ? మావా డొకడు నామీాదికి పోటీకి వచ్చాడు. నాక్కాకపోతే మరెవరి కయినా యిప్పించు వాడికి మాత్రం — విన్నారా? చివరికి మీకిచ్చినా సంతోషిస్తా న్నేను"

౬

కంపెనీఆవరణ అంతా నిండివున్నారు దరఖాస్తుదార్లు. పొట్టి పొడుగు — లావు సన్నం — నలుపు చామనచాయ ఎరుపు — క్రాపింగులు డిప్పలు ఇసలాలు—ఇజార్లు పంట్లాములు పంచెలు — టోపీలు హాట్టులు టర్కీటోపీలు — చుట్టలు సిగరెట్టలు బీడీలు — కోడిమీసాలు గీరమీసాలు నిమ్మకాయనిలిపే మీసాలు నిశ్మశ్రువులు — ప్రపంచంలో వున్న రకా లన్నీ వున్నాయి వారి దగ్గిర.

అందరూ యేమి టేమిటో మాట్లాడుతున్నారు.

చర్చలు చేస్తున్నారు.

విమర్శిస్తున్నారు.

ఆత్మో త్కర్షా పరనిందా సాగిస్తున్నారు.

నవ్వుతున్నారు.

కాని హఠాత్తుగా అందరూ ప్రతిమ లయిపోయారు.

చూడగా, అప్పుడే వచ్చి చిన్నదొర, పోర్టికలో కొలువు తీరాడు.

ఏదో వొక కాగితం చేతబుచ్చుకునివచ్చి మానేజరు దొర మేజాదగ్గిరే వొక పక్కగా కూచోగా దరఖాస్తుల కట్ట తెచ్చి మేజామీాదవుంచి, వెళ్లి దొర వెనుక నుంచున్నాడు బిళ్ల బంట్రోతు.

వచ్చీరావడంతోనే మెయిలుపత్రిక విప్పాడు దొర. అయిదు నిమిషాలపాటు వంచిన తల మెత్తలేదతను. దరఖాస్తుదార్లు ఊపిరికూడా బిగపట్టుకుని వున్నారు. అప్పుడు చూశాడు దొర వారికేసి.

ఒక్క నిమిషమే చూశాడు.

వెంటనే వాచీ చూసి మానేజరుతో యేదో మాట్లాడాడు. తల వూపుతూనే, సులోచనాలు తీసి జేబురుమాలుతో తుడుచుకుంటూ లేచినుంచున్నాడు మానేజరు.

ప్రకృతి అంతా స్తబ్ధం అయిపోయింది.

దరఖాస్తుదార్ల గుండెలు మాత్రం దడదడ కొట్టుకో సాగాయి.

మానేజరు ప్రారంభించాడు.

"ఏకకాలంలో దిగ్గజాలవంటి యింతమంది విద్యావంతు లను చూడగలడం మాఅదృష్టం. మీ కందరికీ దొరగారు శుభంకోరుతూ స్వాగతం యిస్తున్నారు. మీాఅందరి జీవి తాలూ మిక్కిలీ తేజస్వంతాలు కావా లనిన్నీ వారు కోరు తున్నారు. అయితే, మాకు కావలసింది ఒక్కడే గుమాస్తా. చిప్చిప్పుగా వొక యువకుణ్ణి నియమించుకుని మాపని మేము

సాగించుకోడానికి వీలులేకుండా యింతమంది వచ్చి యిది జటిల మైన సమస్య చెయ్యడం మాత్రం మాదురదృష్టం.

" ఈపదవి గ్రేడ్డు యాభై మొదలు ముప్ఫైకదాకాను. సంవత్సరానికి రెండు రూపాయలు ప్రమోషను కూడా వుంటుంది. తమ కొలువులో వున్నవారికి సర్కారువారిచ్చినంత కాలమూ మేమున్నూ పదహారు రూపాయలు అలవెన్సు ఇస్తూ వుంటాము. ఈసంగతులన్నీ మీరు మాపత్రికాప్రకటనలో చూసే వున్నారు.

" అయితే యిందుకోసం దరఖాస్తుచేసి యిక్కడికివచ్చిన మీసంఖ్య రెండువందల యాభై. ఒక్క యిసుక రేణువుకోసం సముద్రం వొడ్డుకు వెళ్లిన ట్టయిం దిప్పుడు మాపని. మీలో తూర్పున బరంపురం, దక్షిణాన చెన్నపట్నం, పడమట బళ్లారి, ఉత్తరాన దుమ్ముగూడెం — యీహద్దుల మధ్యస్థా లయిన అన్నిజిల్లాలనుంచీ, రమారమీ అన్నితాలూకాల నుంచీ వచ్చినవా రున్నారు. ఇన్నిజిల్లాల ప్రాతినిధ్యమూ, ఈసంఖ్యా మాకంపెనీయెడల ఆంధ్రదేశీయుల కుండుకున్న ఆదరాభిమానాలు సూచిస్తున్నాయి. మేమిందుకు మిక్కిలీ గర్విస్తున్నాము.

" కాని యింతమందిలో నిర్ధారణ చేసి వొకణ్ణి తీసుకోడం మాకు చాలా కష్టమైన పని. నిజంగా అసాధ్యం అనే చెప్పాలి. ఈబాధ్యత నిర్వహించుకోడం యెలాగో మేము గుర్తించ లేకుండా వున్నాము. కనక, ఈఅధికారం — అంటే, యింత మందిలోనుంచీ వొకయువకుణ్ణి విడమర్చి మాకు నిర్దేశించే అధి కారం మీలో వొకరి కిచ్చేస్తున్నాము. ఆపెద్దమనిషి మాట మేము సర్వాత్మనా శిరసావహిస్తాము. ఏమీ ఆక్షేపించం.

కారణాలు కూడా అడగం. మీారందరూ బాగా చదువుకున్న వారు. నిశిత మైన ప్రతిభగలవారు. మాపరిస్థితులూ మీా పరిస్థితులూకూడా చక్కబెట్టగల శక్తిసామర్థ్యాలు మీాకు నిండుగా వున్నాయి. కనక, యిందు కంగీకరించేవా రెవరో యిలా వచ్చి యీపీఠం అలంకరించండి”

ఒకటి – రెండు – మూడు నిమిషాలు చూశాడు దొర.

మానేజరు మరో నిమిషం చూశాడు.

అయినా, యెవరూ ముందుకి రాలేదు.

చూసిచూసి దొర యేదో చెప్పగా మానేజరు మళ్లీ లేచాడు.

“మాఆశ నెరవేరలేదు. ఇందరు విద్యార్థికుల్లో వొక్క రున్నూ మాప్రార్థన మన్నించలేదు. ఇందుకు మీాలో యెవ రినీ మేము నెపపెట్టం. పరిస్థితు లలా వున్నాయి మరి. ఇక మాకు మేనుయి మాకు తోచిన పద్ధతి అవలంబిస్తాము”

ఇలా అనిన్నీ మళ్లీవొక నిమిషం ఆగి, మళ్లీదొరతో నున్నూ మంతనం చేసి మానేజరు ప్రారంభించాడు.

“నిజాని కీపనికి స్కూల్‌ఫైనల్లో తేరినవారు చాలు. మాప్రకటనలో యీసంగతి మేము స్పష్టపరిచేవున్నాము; కాని, మీాలో స్కూలుఫైనలు దగ్గిరనుంచి డబుల్ ఎం-ఏల దాకా వున్నారు. కాలేజీ ఫస్టులే కాదు, యూనివర్సిటీ ఫస్టు లున్నూ వున్నారు చాలామంది. అంచేత, మేము, ప్రకటించిన అర్హత మాత్రమే పట్టుకూర్చోడానికి వీలులేదు. ఏమంటే? మన ప్రెసిడెన్సీలో మన బాధ్యత అంతా తమ భుజాస్కంధాల మీాద వుంచుకుని మూడు గొప్పయూనివర్సిటీలు ఏటేటా అనేక వేలమంది పట్టభద్రులను నిర్మించేస్తున్నాయి. మీాలో

అన్యరాష్ట్రాల యూనివర్సిటీల కున్నూ గౌరవప్రతిష్ఠలు కలిగించినవా రున్నారు. కాగా, యూనివర్సిటీలను మేము గౌరవించవలసివుంది. మాబాధ్యత మేము మరచిపోలేము. కనక, మీలో యూనివర్సిటీ పరీక్షల్లో వొక టయినా నెగ్గనివారు మాకక్కర్లేదు, వెళ్లిపోవాలి ”

ఇలా చెప్పి, దొరకేసి చూస్తూ తాపీగా కూచున్నాడు మానేజరు; కాని యువకుల్లో, వొక్కడూ కదల్లేదు. పైపెచ్చు, సముద్రా లన్నీ వొక్కమాటుగా తిరగబడ్డంత కోలాహలం రేగింది వారిలో.

తరవాత కొందరు తమ దౌర్భాగ్యదశని తిట్టుకున్నారు.

కొందరు, కంపెనీనీ, దొరనీ, మానేజరునీ, తమకేసి “ కదలరేం ! ” అన్నట్టు కరుగ్గా చూస్తున్న బిళ్లబంట్రోతునీ దురుసుగానే తిట్టారు, కంఠం మాత్రం బిగపట్టుకుని.

పెద్దపెద్దపరీక్షలిచ్చినీన్ని యీచిన్నపదవికోసం తమతో పోటీపడుతున్న వారిని లోపల్లోపల పడతిట్టారు, కొందరు.

చివరికి ముప్ఫయిముగ్గురు యువకులు బయటికి వెళ్లిపోయి, ఆపదవి యెవరు కొట్టేస్తారో చూసి మరీ వెడదామని యెండ తీక్ష్ణంగా వున్నా ఆవరణ బయట గోడలవారా, చెట్లకిందా మకాంవేశారు.

౭

పెద్దాపిన్నా తారతమ్యం లేకుండా తమతో పోటీకి వచ్చిన లేతసరుకిలా వెళ్లిపోయినందుకు, ఉండిపోయినవా రందరూ మిక్కిలీ సంతోషించారు.

వారిలో ప్రతీవాడూ, తనచుట్టూ విద్యాధికులే వుండి

నందుకు చాలా గర్వించాడు ; కాని ప్రతీవాడూ తనకి పోటీగా వుండడం గుర్తించుకుని చాలా అసహ్యించుకున్నాడు.

ఈస్థితిలో మానేజరు మళ్లీ లేచాడు.

"మీారిప్పుడొక సంగతి బాగా గుర్తించాలి. మేమిప్పుడు నియమించుకునే గుమాస్తా కాపియరుకి జూనియరుగా వుండాలి. ఇందుకు తగ్గట్టు, మాకిప్పుడు పట్టభద్రుడే దొరుకుతాడు కనక, క్రమాంతరాల మీాద కాపియ రయిపోయే అదృష్టం ఆయువకుడికిన్నీ పట్టాలి. అంచేత మేమిప్పుడు మేథమెటిక్సు గ్రాడ్యుయేటుని తీసుకుంటాం. తక్కినవారు వెళ్లిపోవచ్చు" నని చెప్పి అతను సావకాశంగా కూచున్నాడు.

చూసిచూసి "కానివారు వెళ్లిపోవా" లంటూ పురిమాడు బిళ్లబంట్రోతు.

వెంటనే మరో నలభై ఆరుగురు వెళ్లిపోయారు, మెల్లిగా.

మానేజరు చురుగ్గా లేచాడు మళ్లీ.

ఉండిపోయినవారు, సంఖ్య తగ్గినందుకు సంతోషించిన్నీ మానేజరు మళ్లీ యెలాంటి పేచీ లేవదీస్తాడో అంటూ దిగులపడిపోయారు.

మానేజ రందుకున్నాడు.

"చెన్నపట్నం, బొంబాయి, కలకత్తా, ప్రెసిడెన్సీలలో మాకంపెనీకి మొత్తం ముప్ఫయితొమ్మిది బ్రాంచీ లున్నాయి. బర్మాలో వుండిన పదీ, సిలన్‌లో వుండిన అయిదూ కూడా మళ్లీ త్వరలోనే పని ప్రారంభిస్తాయి. ఇప్పుడు మేము నియమించుకునేగుమాస్తా వీటిలో యే బ్రాంచి కెప్పుడు వెళ్లమన్నా నుంచున్నపాటున వెళ్లేవా డయివుండాలి. అందు కిష్టపడలేని వారు వెళ్లిపోవచ్చు" అన్నా డతను మళ్లీ.

యువకుల్లో మళ్లీ వోపాటి కోలాహలం రేగింది.

"ముందే చెప్పావు, సంతోషించాం" అంటూ గొణుక్కున్నారు, కొందరు మెల్లిగా దారిపడుతూ.

"ఈమాత్రం భాగ్యానికి బదిలీలు చేస్తాట్ట వీడు, బదిలీలు. ఎవడి క్కావాలి రండయ్యా యీకూసు నౌకరీ?" అనుకుంటూ మరికొందరు బయలుదేరారు.

"పరుగెత్తి పాలుతాగడం కంటే నుంచుని పచ్చిమంచి నీళ్లుతాగడం మంచిది" అనుకుంటూ మరికొందరు వెళ్లిపోయారు.

"పొట్ట చేత్తో పట్టుకుని ఆరువేల మైళ్లనుం చిక్కడికి వచ్చాడు వీడు. అందరినీ తనలాగే తయారుచేద్దా మనుకుంటున్నాడు కామోసు – హె" అంటూ కొంచెం గట్టిగానే అంటూ మరొకడు వెళ్లిపోయాడు.

వెరశి వారి సంఖ్య 59.

వారిలో ఒక బి. ఎల్. చురుగ్గా వెళ్లి గేటు మధ్యగా నుంచుని, తీక్ష్ణంగా చూస్తూ మొగం మాత్రం యిటు తిప్పి "మీ ప్రకటనలో యీమరతు లేదు. మాలో యెవ డయినా యీ కొత్తకల్పనకు దావా పడేస్తే యూరపువెళ్లి తిరిగి చూడాలి నువ్వు, తెలుసా?" అంటూ వురిమి, బుర్రవంచుకుని తక్కిన వారిలో అంతర్థానం అయిపోయాడు.

దీనిమీద చిరునవ్వు రాగా అణుచుకుని మానేజరు మళ్లీ లేచాడు.

"మన సాంఘికధర్మాలు విలక్షణ మైనవి. ఇతర్ల ధర్మాలతో పోల్చి చూసుకుంటే, వాటిలో చాలా మంచివీ వున్నాయి, చాలా చెడ్డవీ వున్నాయి. ఏమయినా, యుగయుగాలుగా

మన జీవితాలతో పెనవేసుకుని వున్నాయవి. ఎంత కాదను కున్నా మన మవి పూర్తిగా మార్చుకోనూ లేము, కొంత మార్చుకోకా తప్పదు. ఎంత నవీనదృక్పథం అవలంబించినా మనలో భార్యలను భర్తలే పోషించాలి, నేటికీ. ఎంత ప్రతిభా వంతురా లయినా, భార్య, ఏదయినా వృత్తి అవలంబించి ధనసంపాదన చెయ్యడానికి మన ధర్మం ఒప్పుకోదు. అంచేత, మేమిచ్చే జీతంతో ఒక యువకుని అర్థాంగి కూడా సుఖంగా జీవించాలని మాఅభిలాష. కనక, మాకు బ్రహ్మచారు లక్కర్లేదు, వెళ్లిపోవాలి" అని చెప్పి కూచున్నా డతను.

ఈమాట ముగిసీముగియడంతోనే యిరవై ముగ్గురు యువ కులు లేచారు.

వారితోపాటు ఇరవై మూడు కంఠాలు ఖంగుమన్నాయి.

దాంతో, తెనుగుభాషకి వాడిగే హేళనవాక్యాలు చాలా మట్టుకు ఆకాశాన తోరణాలు కట్టాయి.

సంగతి తెలుసుకుని దొర గంభీరంగా చూశాడు.

వెళ్లిపోయినవారిలో కొందరు సిగరెట్టులూ, కొందరు బీడీలు, కొందరు లంకాకుచుట్టలూ వెలిగించగా, కొందరు బయటి చెట్లెక్కి కూచున్నారు.

మానేజరు మళ్లీ లేచాడు.

లేచాడుగాని వొక్క క్షణం నిదానంగా చూస్తూ నుంచు న్నాడు.

చూపులో వున్న ఆ నిదానం వుత్తరక్షణాన లజ్జగా మారింది.

దాంతో అతని కంఠం రుద్ధం అయిపోయింది.

అయినా, చేసేది వొకరి ఆజ్ఞ నిర్వహించడం కనక "ఈ గుమాస్తా, మేమెక్కడికి వెళ్లమంటే అక్కడికి ఏక్షణాన పడితే ఆక్షణాన – ఏ జంజాటమూ లేకుండా లేడికి లేచిందే ప్రయాణం అన్నట్టు బయలుదేరాలి కనక, సంతానవంతులు కూడామాకక్కరలేదు, వెళ్లిపోవాలి" అన్నాడు, చివరికి గద్గదికతో.

వెంటనే పదిమంది యువకులు వెళ్లిపోయారు.

బిళ్లబంట్రోతు ముందుకి వచ్చాటప్పటికి మరో నలుగురు లేచారు.

వెడుతూ వెడుతూ వారిలోయిద్దరు వొక్కమాటాగి, తమలో తామేదో కూడబలుక్కుని, వెనక్కి తిరిగి ఉన్నవా రిలో ముగ్గురిని తర్జనితో నిర్దేశిస్తూ "వారిలో వొకరికి పెళ్లి యీడు వచ్చిన కూతు రుంది. వొకరికి ప్రయమరీ చదువుతూ వున్న కూతురుంది. మూడోవారికి ఎడపిల్లాడూ చంటిపిల్లా, వున్నారు పంపించెయ్యండి దొరగారూ" అన్నారు, చివరికి దురుసుగా వెళ్లిపోతూ.

దాంతో, యిక్కడి గుంపులో నవ్వులూ విసవిసలూ రేగాయి.

"సిగ్గు సిగ్గు" అన్నా రొకరిద్దరూ.

"పోండి పోండి" అంటూ కేకలే వేశారు, దూరాన వొకరిద్దరు.

దానిమీద ఆసంతానవంతుల్లో వొకడు "మీరు పెళ్లా లను పోషించుకోవాలి, మేము పిల్లలకు పెళ్లిళ్లు చేసుకోవాలి.

అడిగేవాడు లేకగాని యిందులో వొకటి ధర్మమూ వొక టధర్మమూనా ?" అనడిగాడు, చురుగ్గా అడుగు వేస్తూ.

"పెళ్లాన్నే పోషించుకో లేనివాడు పిల్లల్ని కనెయ్యడం యేమి ధర్మమండీ ?" అంటూ సాగతీసుకున్నాడు వున్నవారిలో వొకడు, అటు తిరిగి.

"ఆ కేకలువేసిన పెద్దమనిషి కీ వుద్యోగం దొరికినప్పుడు చూద్దాం రావయ్యా" అంటూ రెండోవాడు బయలుదేరాడు.

ఈవోర్వలేనితనమే మన లీస్నికాడికి తెచ్చింది. మీరూ మాతోపాటు వేంచెయ్యవలసినవారే చివరికి, కొంచెం వెనకా ముందూనూ, అంతే" అంటూ మూడోవాడు వెళ్లిపోయాడు.

"మనం వుండడమా వెళ్లిపోడమా" అని ఆలోచన పడ్డాడు చలపతి.

చాలా మథనపడ్డాడు.

పరకాయించి చూడగా వొకమూల చతికిలబడి వున్నాడు గోపాలశాస్త్రి, నిశ్చలంగా.

"బతికాం" అనుకున్నాడు చలపతి.

దండిపోయాడు.

౮

ఇన్ని వడపోతలకూ తట్టుకోగలిగినవారు అరవై యేడుగురు.

వారిలో ప్రతీవాడూ కంపెనీవాళ్లుండా లన్న సకల యోగ్యతలూ తన కుండినందుకూ మిక్కిలీ గర్వించాడు.

తనతోబాటుండిపోయినవా రెందరో లోపల్లోపలే లెక్క పెట్టుకున్నాడు, గుండ్రంగా తిరుగుతూ.

ప్రతీవాడూ "ఒక్క గుమాస్తాగిరీకోసం యింతమందా? ఛీ, మనవాళ్లకి నౌకరీకోసమే చదువు" అంటూ చీదరించుకున్నాడు.

ప్రతీవాడూ "ఈపదవి నాదే" అంటూ ఆత్రపడుతూనుంచున్నాడు.

ఈస్థితిలో మానేజరు మళ్లీ లేచాడు.

యువకుల్లో యెవడికి వాడే వూగిపోయాడు.

ఊర్ధ్వశ్వాసతో చెవులున్నూ రిక్కించుకున్నాడు.

సులోచనాలు చేతబుచ్చుకుని ప్రారంభించాడు మానేజరు.

"మీసంఖ్య రెండువందల యాభైనుంచి అరవైయేడింటికి వచ్చింది. దీంతో, మీలో ప్రతివాడూ అసహాయశూరు డని తేలింది. ఎక్కడికి వెళ్లినా మీరు జయించుకురాగలరు.

"ఇంత చేసినా మాఅవస్థ మాత్రం తప్పలేదు. మళ్లీ మేము తికమకలు పడవలసేవచ్చింది; కాని వుపాయం మాత్రం చాలా గొప్పది దొరికింది. మీరూ మేమూ కూడా ధన్యులం.

"ఘనతవహించిన మన దొరతనంవారు, హేమాహేమీలతోకూర్చి "పబ్లిక్ సర్వీస్ కమీషన్" అంటూ ఒక సంస్థ నెలకొల్పివున్నారు. అది, మిక్కిలీ ప్రతిభావంతులైన అనేకమంది గొప్ప ఆఫీసర్ల మేధస్సునిగ్గు. అది చాలాచాలా గొప్ప సంస్థ. ఎంత గొప్పసంస్థ అంటే, ఖండాంతరాల్లో కూడా మన ఆధ్యాత్మికద్వైక్కృథానికి పేరు తెస్తున్న మహాసంస్థ. దేశానికీ జాతికీ దానివల్ల కలుగుతున్న మేళ్లు అసంఖ్యాకాలూ అసాధారణాలూను. దాని అనుగ్రహం సంపాదించుకోగలిగినవారి జీవితాలు జిగాల్ జిగాల్మని మెరిసిపోతున్నాయి.

"అయితే, ఆసంస్థతో మా కేమీ సంబంధం లేదు. దాని నిర్ణయాలు శిరసావహించవలసిన అగత్యమున్నూ లేశమూ కూడా లేదు మాకు; దానిపద్ధతులు మాత్రం మా కిప్పుడు బాగాఅర్థం అయినాయి. అంచేత నచ్చాయి; విశేషించి యీగడ్డుసమయంలో మా కవే తారకాలు.

"కనక, ఆవరవడి దిద్దుకుని మేమిప్పుడు మూడు ప్రశ్న లడుగుతాం. మీలో ప్రతీవాడూ వాటికి సరి అయిన ప్రత్యుత్తరాలు చెప్పాలి. చెప్పి అదిగో ఆమూలకి వెళ్లి నుంచోవాలి.

"బాగా వినండి.

"మళ్లీమళ్లీ చెప్పం, గుర్తుంచుకోండి.

"ఒకటి, – రేపు పట్టాభిషేకం అనగా, శ్రీరామచంద్ర మూర్తి యివాళ యేమేమి పిండివంట లారగించాడు?

"రెండు, – గోదావరి హిమవత్పర్వతంమీద ఎన్ని వేల అడుగుల యెత్తున పుట్టింది?

"**మూడు**, – మండు వేసవిలో పట్టిసం కొండచుట్టూ ఎన్ని నిలువుల లోతు నీరుంటుంది?

వినీవినగానే "వోస్, ఇంతేనా" అనుకున్నారు యువకులు.

దాంతో, ప్రత్యుత్తరాలు చెప్పడానికి వారిలో సంగం దాకా తోపుళ్లుపెట్టుకుంటూ ముందుకి వచ్చినుంచున్నారు.

అది చూసి దొర, నిరసనగా బల్లగుద్ది, యేదో గొణుక్కున్నాడు.

వెంటనే బిళ్లబంట్రోతుని పంపించి మానేజరు అక్కడ "క్యూ" పద్ధతి యేర్పాటుచేయించాడు.

యువకుల కదివరకే వున్న చురుకు రెట్టించింది.

ఒక్కొక్కడే ముందుకి వచ్చి తడుముకోకుండా బదుల్లు

చెప్పేసి నిర్దిష్టస్థలంలో నుంచోసాగాడు కూడా ఎవడికి వాడే "మనమే కొట్టేశాం" అనుకుంటూ.

కాని యిద్దరు మాత్రం బదుల్లూ చెప్పలేదు, కదలాలేదు.

"ఏం, నుంచున్నారేం?" అనడిగాడు బిళ్లబంట్రోతు.

అయినా వారు కదల్లేదు.

వారిద్దరూ – వొకడు సుబ్బమ్మ అల్లుడు చలపతిరావూ మరోడు ఆమె సవతికొడుకు గోపాలశాస్త్రీని.

"మీ ప్రశ్నలు సరిగాలేవు" అని మాత్రం చెప్పి నిర్దిష్టస్థలానికి వెళ్లిపోయాడు చలపతిరావు.

"పట్టాభిషేకం రేపనగా, ఇవాళ, శ్రీరామచంద్రమూర్తి కటికిఉపవాసం చేశాడు. గోదావరి హిమవత్పర్వతంమీద పుట్టలేదు. పట్టిసం కొండచుట్టూ నడివేసవిలో నిప్పులు కక్కుతూ యిసకతిప్పలు మాత్రమే వుంటాయి" అని వివరంగా చెప్పి గోపాలశాస్త్రి కదిలాడు.

దొర తల పంకించికున్నాడది విని.

"సెబాస్" అన్నాడు మానేజరు అపవారించి.

ఇదంతా వినీ చూసీ, అక్కడ "నాకునా" కంటూ మోచేతులతో కుమ్ముకుంటూ ఒక్కొక్క అడుగే ముందుకి జరుగుతూవున్న యువకు లందరూ ముందు కొయ్యయిపోయి, తరవాత నాలుకలు తెగ్గరుచుకున్నారు.

—

వెనక్కి చేరబడి తల పంకించుకుంటూ వొక్క క్షణం ఆలోచించి, ముందుకి వంగి మోచేతులు బల్లమీద ఆనుకుని, మెల్లిగా చెప్పాడు దొర యేదో.

అది వినాటప్పటికి మానేజరు మొగాన విన్నదనం అలుము కుంది; కాని చివాలున లేచినుంచున్నా డవ్యవధానంగా.

వెంటనే చలపతిరావుకీ గోపాలశాస్త్రికీ గుండెల్లో గుర్రాలు పరుగులు తీశాయి.

"దొరగారు చెబుతున్న దేమి టంటే?" అంటూ మానేజ రందుకున్నా డప్పుడు.

"రెండువందల యాభైమందిలోనూ మీరిద్దరే సర్వసమర్థులు. మీరిద్దరే యెవరి కయినా బాగా వుపకరించగలవారు. మీరు ప్రత్యుత్తరా లివ్వడంలో విధానం మారినా, మాప్రశ్న లసందర్భంగా వున్నాయనడంలో ఒక్కటే అయినారు - అంచేత, మేమిప్పుడు, మీయిద్దరిలో ఒకరి కీవుద్యోగం యిచ్చేస్తే రెండోవారి కన్యాయం చేసిన ట్టవుతుంది. దాంతో, వెనకటి శ్రమ అంతా వ్యర్థం అనిపించుకుంటుంది. కనక, మళ్లీ మేమింకో పరీక్ష చెయ్యవలసే వుంది.

"అయితే, యిది చివరి పరీక్ష"

ఇలా అన్నాడే గాని వొక్క నిమిషం మాట్లాడ లేకపోయా డతను.

మర్మాంతిక ఆవేదన మొగం అంతా అలుముకుం దతనికి.

పోనీ, ఈపరీక్ష పద్ధతి చెప్పకపోతేనో అంటే తన అన్నం పడిపోతుంది.

తన పదవినిబట్టి అగత్యం అయి, తన చేతికిందివారిమీద, ఎన్నిమాట్లో యెంతో నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించినవాడే అతను.

అపతలివారి దగ్గిర దోషం వుంటూరావడంవల్ల అనివార్యం అయిం దది, దౌర్జన్యం మాత్రం కాలేదు.

ఇప్పుడు దరఖాస్తుదారులూ నిర్దోషులే, తానూ నిర్దోషే.

ఆమాటకి వస్తే దొరా నిర్దోషే వొక విధంగా.

రిజిస్టర్డుకంపెనీ లోకవిధ మైన 'లా' కి బద్ధమై వుండాలి మరి.

నిజమే; కాని చరిత్రకే కొత్త దవుతుంది తానిప్పుడు చెప్పబోయేది.

విజాతీయుడి పక్షంగా, మధ్య, తాను, సజాతీయులమీా దే నిర్వహించా లది.

కాని అనివార్యం.

అటూ యిటూ కూడా పరిస్థితులు అలా విషమించాయి.

ఇందుకూ అతని ఆవేదన.

ఏమయినా, గుండె రాయిచేసుకోవలసివచ్చిం దతనికి.

గుండెలే లేని బంటున్నా కావలసివచ్చింది.

కళ్లుమూసుకుని సాహసించాడు.

మరోవైపు చూస్తూ "మీా రిద్దరూ వెళ్లి గేటులో సమ రేఖమీాద నుంచోండి.దొరగారు పిస్తోలు పేలుస్తారు. వెంటనే బయలుదేరి కంపెనీ ఆవరణచుట్టూ పరుగెత్తుకి రండి. ముందు వచ్చినవారి దీవుద్యోగం" అన్నాడు, గద్గదికతో.

ముచ్చెమటలూ పోశా యతనికి.

దీనికి సాయం, అక్కడ గాలి స్తంభించుకుపోయింది.

చెట్లున్నూ కొయ్యబారిపోయినట్లు నిశ్చలా లయిపోయాయి.

ప్రకృతి నీరవం అయిపోయింది.

దొరమాత్రం నిర్వికల్పంగా కూచున్నాడు, కుర్చీకి జేరబడి.

బిళ్లబంట్రోతుకూడా మొగం పక్కకి తిప్పుకుని నాలు క్కరుచుకున్నాడు.

చలపతిరావూ గోపాలశాస్త్రీకూడా గుండెల్లో పొడిచినట్టయిపోయారు.

ఏమిటి చెయ్యడం ?

ఇద్దరూ గంభీరంగా చూసుకున్నారు.

ఇద్దరూ తీవ్రంగా ఆలోచించుకున్నారు.

వారు విద్యాధికులే; కాని అంధకారం తాండవంచేస్తోంది కళ్లయెదుట.

వారు సింహకిశోరాలే; కాని కడుపులో పేగులు మాడిపోతున్నాయి.

అన్నం వండుదా మంటే బియ్యపుగింజల్లేక, చలపతిరావు కళ్లకి సుందరీ, గోపాలశాస్త్రి కళ్ళకి కామేశ్వరీ, భగభగమండపోతున్న పొయ్యిలదగ్గిర చతికిలబడి దిగాలుపడిపోయి వున్నట్టు కనపడ్డారు.

కళ్లు తిరిగిపోయాయి వారికి.

కాని, శృంఖలాబద్ధులు వారు.

పర్వతాలను మించిన బాధ్యతల బరువు లున్నాయి వారి శిరస్సులమీద.

"ఉద్యోగంకోసం పందెపుగుఱ్ఱాల్లాగ పరుగెత్తడం అమానుషం కాదా అంటే, మానుషం తక్కా లంటే యిప్పుడు మరోదారేదీ" అంటూ యెవరో సద్దిచెబుతున్నట్టనిపించింది వారికి.

నిజానికి, —

మనిషయినవాడు, చెయ్యరాని చెడ్డా లేదు, చెయ్యలేని మంచీ లేదు.

మనిషయినవాడు, పాల్పడరాని స్వార్థమూ లేదు, సాధించ లేని పరార్థమూ లేదు.

మనిషయినవాడు, దిగరాని నైచ్యమూ లేదు, అందుకో లేని ఉచ్చస్థితీ లేదు.

మనిషయినవాడు, చెయ్యరాని నాశమూ లేదు, చెయ్యలేని నిర్మాణమూ లేదు.

మనిషయినవాడు, పుట్టుకతో సర్వస్వతంత్రుడు; కాని మన యూనివర్సిటీల ద్వారాల్లో అడుగుపెట్టాడా నౌకరీ చెయ్యడానికి తప్ప మరెందుకూ పనికిరాడు.

ఉన్నట్టుండగా, ఈ నగ్నసత్యం కళ్ల కట్టినట్టయింది వారికి.

"హు" అనుకున్నారు వారు.

అనుబంధాలు తెంపేసుకున్నారు వారు.

ఉత్తరక్షణంలో పిశాచప్రవృత్తి అలుముకుంది వారిని.

"నా కడ్డేమి" టన్న అహమికతోనూ "నీలెక్కేమి" టన్న స్ఫూర్తితోనూ, బరువుగానూ దురుసుగానూ అడుగులు వేసుకుంటూ వెళ్లి గేటులో నుంచున్నారు వరాసగా వారు.

బిళ్లబంట్రోతు పిస్తోలు తెచ్చి దొరచేతి కిచ్చి, వెళ్లి వారి పక్కగా నుంచున్నాడు; కాని గుండెలు గుబగుబలాడిపోగా మొగం పక్కకి తిప్పేసుకున్నాడు.

నుంచోలేక మానేజరు కుర్చీలోకూలబడ్డాడు, మొగాన చేతులు కప్పుకుని.

కాని, దొరమాత్రం చెయ్యిపైకెత్తాడు, గంభీరంగానూ నిశ్చలంగానూ చూస్తూ.

పిస్తోలు ధామ్మంది.

వెంటనే అక్కడ వారిద్దరూ ముందు కురికారు.

ఎ - ఘీరిపోయారు.

రెండు నిమిషాలకు బయటికి పోయివున్న దరఖాస్తుదారుల కరతాళధ్వనులతో దిక్కులు పిక్కటిల్లాయి.

నిదానించి చూడగా, తలకాయ తీసుకువెళ్లి పొట్టలోపెట్టుకుని దొరయెదట కొయ్యయిపోయి వున్నాడు గోపాల శాస్త్రి.

మానేజరు కళ్లు చెమ్మగిల్లాయి.

పరుగుపరుగున వెళ్లి గ్లాసులో పోసి సోడా తీసుకువచ్చాడు బిళ్లబంట్రోతు.

పిస్తోలు బల్లమీద వుంచేసి, దర్జాగా వెళ్లి వీపుతట్టి, ప్రసంసిస్తూ షేక్‌హాండిచ్చి, చెయ్యిపట్టుకుని తీసుకువచ్చి తన పక్కని కూచోబెట్టుకుని, సాదరంగా సోడాగ్లా సందించాడు దొర గోపాలశాస్త్రికి.

— 1948 ఏప్రిల్ ఆంధ్రశిల్పినుంచి

15 నిమషాలకు సరిపోయేటట్టు కుదించి, 15-12-1947 తేదీ సాయంత్రం 7-30లకు మదరాసు రేడియోలో చదివిన చిన్న కథ యిది.]